క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు జరిపారు.

బకాయి వేతనాల కోసం ఉపాధి కూలీల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

పరవాడ: ఉపాధి హామీ పథకం బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. రావాడ శివారు రేకవానిపాలెంలో ఉపాధి కూలీలు బకాయి వేతనాలు చెల్లించాలంటూ మంగళవారం నిరసన తెలిపారు. నిరసనలో పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ మండలంలో ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన రూ.2 కోట్ల బకాయి వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం చెల్లించి, పేస్లిప్‌లు అందించాలన్నారు. బకాయి వేతనాలు చెల్లించకపోవడంతో ఉపాధి కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కల్పించుకుని సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షకీల బేగం, అని మున్నీషా, భారతి, సోములమ్మ., లక్ష్మి, ఆలీ, మదీనా, రమణి పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలి



తహసీల్దార్ ఆనంద్‌కు వినతిపత్రం అందిస్తున్న గంగారావు, సీపీఎం నాయకులు

పెందుర్తి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. జీవో 30, గత ప్రభుత్వంలో ఇచ్చిన 296, 388 జీవోల ప్రకారం పేదలకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 296, 388 జీవోల ప్రకారం మంజూరు చేసిన పట్టాలను ఆధీకృత పట్టాగా బదిలీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రాబోయే రోజుల్లో రిజిస్ట్రేషన్లు అయ్యేలా పట్టాలను రూపొందించాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు బి.వెంకట్రావు, రమణి, వెంకటలక్ష్మి, జగన్, సరోజిని, సుహాసిని, ప్రభుదేవా, రాజు, ఈశ్వరరావు, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

సబ్బవరం: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో నియోజకవర్గ కన్వీనర్ గొర్లి రామునాయుడు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.సబ్బవరంలోని 31, 33 బూత్‌లలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ రెడ్డి రామునాయుడు, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు భూపతి అప్పారావు, గొటివాడ సామ్రాట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శీటలు వారి.. నీరుగారుతూ..

- ప్రమాదకరంగా ఓవర్ హెడ్ ట్యాంక్‌లు
- పెచ్చులూడుతూ భయంగొలుపుతున్న వైనం
- ఏ క్షణం కూలిపోతాయోనని స్థానికుల ఆందోళన
- వాటిని కూల్చి, కొత్తవి నిర్మించాలని డిమాండ్

వేసవి ప్రతాపం చూపుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. వీటికి తోడు శిథిలావస్థకు చేరిన రక్షిత మంచినీటి పథకాలతో నీటి వృథా పెరుగుతోంది. మరమ్మతులు చేపట్టకపోవడంతో ఏ క్షణం ఏ ప్రమాదం ముంచుకొస్తుందోననే ఆందోళనలో సమీప ప్రజలు బతుకులు వెళ్లదీస్తున్నారు. పరవాడ మండలంలోని వాడచీపురుపల్లి శివారు గొరుసువానిపాలెం, తిక్కవాని పాలెం, నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో ఏళ్ల క్రితం నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లే ఇందుకు నిదర్శనం.

లక్ష్యం 'నీరుగారుతోంది'!

పరవాడ:

ప్రజల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాలు పూర్తి స్థాయి మరమ్మతులకు గురయ్యాయి. పెచ్చులూడి, పిల్లర్ల ఇనుప చువ్వలు దర్శనమిచ్చి భయంగొలుపుతున్నాయి. ఓవర్ హెడ్ ట్యాంక్ పరిసరాల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయాందోళనలతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. రెండు, రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ మంచినీటి పథకాలను తొలగించి, కొత్తగా పునర్నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నా.. అధికారుల్లో మాత్రం స్పందన కనిపించట్లేదు.

నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో 20 ఏళ్ల క్రితం నిర్మించిన మినీ రక్షిత మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. ట్యాంకుకు ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టని కారణంగా ట్యాంకు శ్లాబ్ నుంచి నీరు చిమ్ముతోంది. ట్యాంక్ పిల్లర్లు పెచ్చులూడి రాలిపోయి, ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. ట్యాంకు పరిసరాలో అపరిశుభ్రత తాండవిస్తోంది. శిథిల ట్యాంకును తొలగించి కొత్త ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



వెంకటపతిపాలెంలో శిథిలావస్థకు చేరిన మినీ రక్షిత మంచినీటి పథకం (ఇన్‌సెట్) ట్యాంకు దిగువ భాగంలో పెచ్చులూడిన పిల్లర్

భయంభయంగా బతుకులు

మత్స్యకారులు నివసిస్తున్న తిక్కవానిపాలెంలో 20 ఏళ్ల క్రితం ఎన్టీపీసీ యాజమాన్యం రక్షిత మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేసింది. ఇది శిథిలావస్థకు చేరింది. ఏ క్షణంలో కూలిపోతుందోనని పరిసరాల్లో నివాసం ఉంటున్న ప్రజలు భయంభయంగా బతుకుతున్నారు. దీన్ని తొలగించి కొత్తది నిర్మించాలని కోరుతున్నారు. ట్యాంకు మెట్ల మార్గం పూర్తి శిథిలావస్థకు చేరడంతో చాలా కాలం నుంచి ట్యాంకులో బ్లీచింగ్ చేయట్లేదు. దీంతో అపరిశుభ్రమైన నీరు వస్తోంది. రిపేర్లతో మూల్గుతున్న ట్యాంకు పైభాగం పెచ్చులూడి పడడంతో సమీపంలో నివసిస్తున్న ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. త్వరితగతిన దీన్ని తొలగించాలని స్థానిక గంగపుత్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తిక్కవానిపాలెంలో పెచ్చులూడుతున్న మంచినీటి పథకం, (ఇన్‌సెట్) మెట్ల మార్గం దుస్థితి

ఎగువ ప్రజలకు నీరేదీ?

వాడచీపురుపల్లి శివారు గొరుసువానిపాలెంలో సెప్టెంబరు 2000లో సుమారు రూ.10 లక్షల వ్యయంతో మినీ రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేశారు. దాని ఆలనాపాలనా చూసే నాథుడు లేక శిథిలావస్థకు చేరింది. ట్యాంకు పైభాగానికి నిర్మించిన మెట్ల మార్గం పూర్తిగా దెబ్బతింది. మెట్లు పెచ్చులూడి పడుతున్నాయి. పిల్లర్లు కూడా పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. మెట్ల మార్గం దెబ్బతినడంతో ట్యాంకులో బ్లీచింగ్, శుభ్ర పర్చడానికి పంచాయతీ సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. ట్యాంకును లోతట్టు ప్రదేశంలో నిర్మించడంతో ఎగువ భాగంలో నివసిస్తున్న ప్రజలకు తాగునీరందక ఇబ్బంది పడుతున్నారు.



గొరుసువానిపాలెంలో కూలే స్థితిలో ఉన్న మినీ రక్షిత మంచినీటి పథకం, (ఇన్‌సెట్) మెట్ల మార్గంలో పెచ్చులూడిన పిల్లర్

ఎగువ ప్రాంతానికి నీరందట్లేదు



మినీ రక్షిత మంచినీటి పథకం లోతట్టు ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో ఎగువ ప్రాంత ప్రజలకు నీరందట్లేదు. ట్యాంకు చిన్నది కావడంతో వేసవిలో ప్రజలకు అవసరమైన తాగునీరు కూడా అందడం లేదు. ట్యాంకు మరమ్మతులకు గురైంది. పెచ్చులుగా విరిగి రాలిపోతున్నాయి. ట్యాంకులో బ్లీచింగ్ పిచికారీ చేయడానికి సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. ట్యాంకును పునరుద్ధరించాలి.

– బూస అచ్చియ్యమ్మ, గొరుసువానిపాలెం

మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేయాలి



ఇరవై ఏళ్ల క్రితం నిర్మించిన మంచినీటి పథకం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. కూలడానికి సిద్ధంగా ఉంది. పిల్లర్లు దెబ్బతిన్నాయి. ట్యాంకు కారిపోతోంది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం కనిపించలేదు. ట్యాంకు చిన్నది కావడంతో ప్రజలకు సరిపడా తాగునీరందడం లేదు. ప్రతి రోజూ తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

– పైల అక్కన్న, వెంకటపతిపాలెం

భయంగా భయంగా బతుకుతున్నాం



గ్రామంలో శిథిలావస్థకు చేరిన మంచినీటి పథకం ఇళ్ల మధ్యలో ఉండటంతో ఏ క్షణంలో ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నాం. మెట్ల మార్గం పూర్తిగా దెబ్బతినడంతో చాలా కాలం నుంచి ట్యాంకును శుభ్రం చేయట్లేదు. నాచు పట్టిన నీరు వస్తోంది. ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. ట్యాంకు పైభాగం నుంచి పెచ్చులూడుతున్నాయి. ఇటీవల ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.

– తిక్కాడ దేముడు, తిక్కవానిపాలెం

ఉన్నతాధికారులకు నివేదించాం

మండల పరిధిలో మరమ్మతులతో మూల్గుతున్న ఓవర్ హెడ్ ట్యాంకులపై వివరాలు సేకరించాం. వాటి రిపేర్ల కోసం నిధుల మంజూరు చేయాలని కోరుతూ ఉన్నతాధికారులకు పూర్తి ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాం. మరమ్మతుల కారణంగా నీటి సరఫరాకు ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేవు. ప్రజలకు అవసరమైన తాగునీటిని అందిస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే త్వరలో శిథిలావస్థకు చేరిన మంచినీటి పథకాలకు మరమ్మతులు చేపడతాం.

– షణ్ముఖ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ తుహిన్ సిన్హా



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా



స్టేషన్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ

- గంజాయి రవాణాపై వివరాలు సేకరించాలని ఆదేశం

సబ్బవరం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై సమీక్షించారు. ప్రధానంగా పేదలు, వృద్ధులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని, వాటి పరిష్కారానికి పోలీస్ సిబ్బంది నిరంతరం కృషి చేయాలని సూచించారు. బేసిక్ పోలీసింగ్‌తోపాటు, విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి సేవించే వివరాలు సేకరించి, అక్రమ రవాణా అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, సైబర్ నేరాలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తరుచుగా నమోదవుతున్న నేరాలు, పెండింగ్ ఫైళ్లను పరిశీలించి ఆయా కేసుల పురోగతిపై సమీక్షించి, తగు సూచనలిచ్చారు. రౌడీ షీటర్లు, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తుల వివరాలను సేకరించి వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. దొంగతనాల నియంత్రణకు గస్తీ విధులు మరింత పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఆయన వెంట పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, సబ్బవరం సీఐ పిన్నింటి రమణ, ఎస్ఐలు సింహాచలం, దివ్య తదితరులున్నారు.

సందడిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తెలిపారు. కళాశాలలో మంగళవారం జరిగిన 17వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిగ్రీ కళాశాలతో తనకు విడదీయలేని అనుబంధం ఉందన్నారు. కళాశాల వసతులు, సమస్యలపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. కళాశాలలో వసతుల కల్పనకు రూ.2.3 కోట్లు, ప్రహరీ నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరైనప్పటికీ ఫైనాన్స్ క్లియరెన్స్ రాలేదని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో మాట్లాడి, ఫైనాన్స్ క్లియరెన్స్ ఇప్పించే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రగతి నివేదికను ప్రిన్సిపాల్ చదివి వినిపించారు. ఎక్కువ మంది అమ్మాయిలు కళాశాలలు చేరుతున్నారని, హాస్టల్ వసతి లేకపోవడంతో మధ్యలోనే మానేస్తున్నారని పేర్కొన్నారు. బీసీ మహిళా హాస్టల్ మంజూరు చేయాలని ఎమ్మెల్సీని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. వేడుకల్లో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి మామిడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



కళాశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు తదితరులు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు ఇస్తున్న సీడీపీవో లలిత కుమారి

సబ్బవరం: చిన్నారులకు తగిన పౌష్టికాహారం అందించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సబ్బవరం ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి తెలిపారు. స్థానిక కోమటవీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ప్రారంభమైన పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో పాల్గొన్న ఆమె మాట్లాడారు. ఈ పక్షోత్సవాలు ఈ నెల 22 వరకూ కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో భాగంగా నాలుగు దశలలో అంగన్‌వాడీ చిన్నారులకు ఇవ్వాల్సిన పౌష్టికాహారంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. మహిళలు గర్భం దాల్చిన నుంచి మొదటి 100 రోజుల వరకూ ఇవ్వాల్సిన పోషకాహారం కోసం స్వచ్ఛందంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, పర్యవేక్షకులు తగిన సమాచారం అందించాలని సూచించారు. బాలింతలు మ బిడ్డలకు ఏ విధంగా పాలు అందించాలి, అప్పుడే పుట్టిన బిడ్డను ఎలా చూసుకోవాలి, మూడు నెలలు వచ్చేసరికి ఏ విధంగా వారిలో ప్రేరణ కలిగించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. చిన్నారుల్లో అధిక బరువు సమస్య తలెత్తకుండా జంక్ ఫుడ్ ఇవ్వడాన్ని కట్టడి చేయాలన్నారు. పిల్లల సంరక్షణలో సాధ్యమైనంత వరకు తల్లులు ఆనందాన్ని వెతుక్కునేలా ఉంటే తల్లీ బిడ్డల మధ్య గాఢమైన అనుబంధం ఏర్పడుతుందన్నారు. మొబైల్ ఫోన్లు, టీవీలకు పసి పిల్లలు అలవాటు పడేలా చేయొద్దని తల్లులకు తప్పనిసరిగా వివరించాలని, ఇందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆర్.పైడితల్లి, మహిళా పోలీస్ డీపీఎల్ నళిని, కె.మణికుమారి, హెచ్ వరలక్ష్మితో పాటు పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటం

పెందుర్తి: ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్నామని సీపీఐ నేతలు ఆర్.శ్రీనివాస్, వై.రాంబాబు అన్నారు. సీపీఐ బర్దన్‌నగర్ శాఖ తొలి మహాసభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ సామాన్యుల పక్షాన పోరాడుతున్నామన్నారు. వందేళ్ల పార్టీ చరిత్రలో లక్షలాది ఎకరాల భూమిని పేదలకు దక్కేలా చేసిన ఘనత సీపీఐదేనన్నారు. సభలో.. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగించాలని, బర్దన్‌నగర్‌కు ఇళ్ల పట్టాలు, విద్యుత్ సదుపాయం కల్పించేలా పోరాటం చేయాలని తీర్మానాలు చేశారు. బర్దన్‌నగర్ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ నేతలు అంపవల్లి అన్నపూర్ణ, పాగోటి దుర్గారావు, పి.పరశురామ్, కె.రామారావు, అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఆ పార్టీ నేతలు

గ్యాస్ ధర పెంపుతో సామాన్యులపై భారం



దేశపాత్రునిపాలెంలో గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పరవాడ: గృహ అవసరాలకు వినియోగించే వంట గ్యాస్ సిలిండర్‌పై కేంద్ర ప్రభుత్వం రూ.50 పెంచి సామాన్యులపై అదనపు భారం మోపడం అన్యాయమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు విమర్శించారు. పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలపై నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం దేశపాత్రునిపాలెంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు వంట గ్యాస్, డీజిల్ ధరలు తగ్గిస్తామని హామీలిచ్చి ఎన్నికల తరువాత వాటి ధరలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యుల జీవనంపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాక మునుపు రూ.450 ఉన్న వంట గ్యాస్ సిలిండర్ ధర ఇప్పుడు రూ.850కి పెరిగిందన్నారు. రూ.63 ఉన్న లీటరు పెట్రోల్ ధర నేడు రూ.110కి చేరిందన్నారు. ప్రజలపై ధరలు పెంచి వారి జీవితాలను కష్టాల్లోకి నెట్టడమే మోదీ ప్రభుత్వ విధానంగా కనిపిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బూసి పరమేశ్వరి, తులసి, నారాయణమ్మ, జి.లక్ష్మి, ఎం.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ధర పెంపుపై నిరసన నేడు

పెందుర్తి: వంట గ్యాస్ సిలిండర్‌పై కేంద్ర ప్రభుత్వం రూ.50 పెంచినందుకు నిరసనగా బుధవారం పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభంకానున్న ఆందోళనకు ప్రజలంతా తరలిరావాలని కోరారు.

అప్పన్న కల్యాణం.. పులకించిన భక్తజనం



కొట్నం దంచుతున్న పురోహితులు, చిత్రంలో ఈవో సుబ్బారావు దంపతులు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ శోభతో సింహగిరిపై సందడి నెలకొంది. విద్యుద్దీప కాంతులు ధగధగలాడాయి. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కొట్నాల ఉత్సవంతో ప్రారంభమైన కల్యాణోత్సవ ఘట్టాలు రాత్రి జరిగిన వార్షిక కల్యాణ మహోత్సవంతో ముగిశాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించి పులకించారు. అర్చకులు, ముత్తైదువులు, దేవస్థానం ఈవో కె.సుబ్బారావు దంపతులు కొట్నాలు ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద గరుడాళ్వార్ చిత్రపటాన్ని ఎగురవేసి, ధ్వజారోహణం జరిపారు. సింహగిరి మాడ వీధుల్లో ఎదురు సన్నాహోత్సవం, రథోత్సవం, ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో ఏర్పాటుచేసి భారీ వేదికపై వార్షిక కల్యాణోత్సవం వైభవంగా జరిగాయి. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. కల్యాణోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక, నృత్యప్రదర్శనలు అలరించాయి. – సింహాచలం



బాలికల కోలాటం



ఆకట్టుకున్న శక్తి వేషాలు